క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థులకు శిక్షణ, ఉపాధి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా 2022–23 సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి 60 శాతం మార్కులను సాధించిన విద్యార్థులకు హెచ్సీయల్ టెక్ బీలో శిక్షణ, ఉపాధిని కల్పిస్తున్నట్లు ఇంటర్ డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. హెచ్సీఎల్ టెక్ బీ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ హెచ్సీఎల్ టెక్ బీ ద్వారా ఐటీ రంగాలలో రాణించడానికి ఒక గొప్ప అవకాశం అన్నారు. హెచ్సీఎల్ టెక్ బీ ఆన్లైన్ పరీక్ష 17వ తేదీన కడప బాలాజీనగర్లోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలకు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9908808914, 6300125455 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టీ స్టాల్ ప్రారంభం



టీస్టాల్ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో ద్వారకా కాంప్లెక్స్లో వైఎస్సార్సీపీ నాయకులు, బేడ, బుడగ, జంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి, దరిశా ప్రదీప్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన అమృత టీ స్టాల్ను ఉప ముఖ్యమంత్రి ఎస్బి అంజద్బాషా, మేయర్ సురేష్ బాబు శుక్రవారం ప్రారంభించారు. పస్తం అంజి రాజకీయాల్లోనేగాక వ్యాపారంలో కూడా రాణించాలని కోరారు. వైఎస్సార్సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, సుబ్బారెడ్డి, షఫీ, డా. సొహైల్, లింగమూర్తి, సీఆర్ఐ శ్రీను, సాహితీవేత్త గానుగపెంట హనుమంతరావు పాల్గొన్నారు.

హక్కులను హరించడం సరికాదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య హక్కులను ఉల్లంఘించరాదని ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెంబర్ 1ను హైకోర్టు కొట్టి వేయడం సంతోషకరమని పేర్కొన్నారు.

సీపీఐ కార్యాలయంలో.... రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం సరికాదని సీపీఐ నగర కార్యదర్శి ఎన్. వెంకట శివ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో అయన మాట్లాడారు.

మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత



మొక్కలు నాటి నీరుపోస్తున్న వీసీ

వైవీయూ : మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత అని వైవీయూ వైస్ చాన్స్లర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూ బొటానికల్ గార్డెన్ను ఆయన సందర్శించి మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా గార్డెన్లోని వివిధ జాతుల మొక్కల సంరక్షణ, అంతరించిపోతున్న జాతుల మొక్కల పెంపకం గురించి గార్డెన్ బాధ్యులు ఆచార్య ఎ. మధుసూదన్రెడ్డి వీసీకి వివరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గార్డెన్ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారం అందిస్తామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, డా. ఎస్.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వీసీకి శుభాకాంక్షల వెల్లువ
యోగివేమన విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్స్లర్గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య చింతా సుధాకర్ను శుక్రవారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో రెమిడియల్ క్లాసులను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులచే రెమిడియల్ తరగతులు, నాడు–నేడు పనులు పర్యవేక్షణ, వి లవ్ రీడింగ్ వంటి పనులు చేయిస్తున్నారని వీటికి సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలన్నారు. నాన్ వేకేషన్ డిపార్టుమెంట్గా పరిగణించి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రామోహన్రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్రెడ్డి, రఘుప్రసాద్, చంద్రమోహన్, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్ఐల బదిలీ

కడప అర్బన్: నగరంలోని చిన్నచౌక్ పోలీస్స్టేషన్లో ఎస్ఐలుగా పనిచేస్తున్న జి. అమర్నాథ్ రెడ్డిని ప్రొద్దుటూరు ఒన్టౌన్కు, ఎస్కే రోషన్ ను సింహాద్రిపురం పోలీస్స్టేషన్కు ఎస్పీ అన్బురాజన్ బదిలీ చేశారు. ఎస్ఐ రోషన్ సింహాద్రిపురంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పిల్లలు ఆద్యంతం ఉల్లాసంగా పాల్గొంటున్నారు. కొందరు చుక్కలతో డ్రాయింగులేస్తుంటే... మరికొందరు ఎంచక్కా కథలు ఆలకిస్తున్నారు. అంతేనా ఆంగ్లాన్ని వల్లె వేసేవారు కొందరు.. కంప్యూటర్ కీ బోర్డులతో ఆటాడేసేవారు ఇంకొందరు. వెరసి నగరంలోని పలు శిక్షణ కేంద్రాలు విద్యార్థులతో సందడిగా మారాయి.



సమ్మర్ క్యాంపులో విద్యార్థుల శిక్షణను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్చంద్



డ్రాయింగ్ నేర్చుకుంటున్న చిన్నారులు

కడప కల్చరల్: చిన్నారుల్లో కథలు చదవడం ద్వారా మానసిక వికాసం లభిస్తుందని వేసవి శిక్షణ శిబిరం శిక్షకులు రంగనాయకులు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కొండాయపల్లెలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యార్థుల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా శిక్షకులు కథా పఠనం నిర్వహించారు. కథ మనిషిలో ఊహా శక్తిని, సృజన శక్తిని పెంచుతాయని, ముఖ్యంగా బాలల్లో చురుకైన ఆలోచనల కోసం కథలు చదవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలరాతను మార్చే చేతిరాత ... అందమైన చేతిరాత చదువుల్లో ముందుండేలా చేయడమే కాకుండా ఆర్థికంగా కూడా లాభాన్ని చేకూర్చి పెడుతుందని చేతి రాత నిపుణులు చంద్రకళ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కడప నగరం రవీంద్ర నగర్లో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో శుక్రవారం ఆమె అందమైన చేతిరాత రాయడం నేర్పారు. ఈ సందర్భంగా ఆమె అక్షరాలను అందంగా రాసేందుకు బోర్డుపై కొన్ని మెళుకువలను నేర్పారు. సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటేశ్వర్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్చంద్ అన్నారు. శుక్రవారం ఆర్టిహోంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో మ్యూజిక్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్స్, క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థుల రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. మ్యూజిక్ క్లాస్లో పిల్లల పాటలను విని వారిని అభినందించారు. కంప్యూటర్ ల్యాబ్లో విద్యార్థులతో మాట్లాడి విద్యా విధానం మెరుగు పరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేశారు.

పారిశుధ్యం, అభివృద్ధి పనుల పరిశీలన
నగరంలో పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలను కమిషనర్ ప్రవీణ్చంద్ పరిశీలించారు. మార్నింగ్ విజిట్లో భాగంగా ఆయన బిస్మిల్లానగర్, గురుకుల్ విద్యాపీఠ్ డ్రైన్, పక్కీరుపల్లె నుంచి ఆర్టీసీ కాలనీ వైపు ఉన్న రోడ్లను పరిశీలించారు. గార్బేజ్ పాయింట్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు. మంజుమియ్యా పార్కులో పెయింటింగ్ వేయాలని, ఫౌంటేన్ ఏర్పాటు చేసి, సైనిక్ బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంహెచ్ఓ ప్రశాంత్వర్ధన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విలువలు తెలిపేందుకే శిబిరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పద్మనాభరెడ్డి, ఓం శాంతి సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : విలువల గురించి బాలలకు తెలియజెప్పేందుకే ప్రత్యేకంగా వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం మంచి కార్యక్రమమని కడప నగరానికి చెందిన విద్యావేత్త పద్మనాభరెడ్డి అన్నారు. స్థానిక ఓం శాంతినగర్లోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా వేసవి సెలవుల శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఓం శాంతి సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ గీతా బెహన్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మనాభరెడ్డి మాట్లాడుతూ ధార్మిక సంస్థలు బాలల్లో విలువలు నింపేందుకు ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు చిన్నారులకు క్రియేటివ్ మెడిటేషన్, నీతి కథలు, మోటివేషనల్ టాక్తోపాటు మరెన్నో ఆసక్తికరమైన అంశాలలో శిక్షణ ఇచ్చారు. ఈనెల 15వరకు రోజూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు.

ఆంజనేయా....ఆశీర్వదించవయా!

రేపు హనుమజ్జయంతి

కడప కల్చరల్ : శక్తి సామర్థ్యాలకు, విశ్వాసానికి, కార్యదక్షతకు, పట్టుదలకు ప్రతీక హనుమంతుడు. ఆయన అండగా ఉంటే దుష్టశక్తులు దరిచేరవన్నది భక్తుల విశ్వాసం. కడప జిల్లాలో ఆయనకు సంబంధించిన పలు విశేషాలు ఉన్నాయి. ఆదివారం హనుమజ్జయంతి నేపథ్యంలో 'సాక్షి' పాఠకుల కోసం ఆ వివరాలు.

- ఇక్కడి పలు ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఆ స్వామికి సంబంధించిన విశేషాలతో ముడిపడి ఉన్నాయి. అందులో ముఖ్యంగా కడప నగరంలోని దేవునికడప ఒకటి. తిరుమల తొలి గడపగా పేరొందిన దేవుని కడప శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయానికి పాలకుడు హనుమంతుడు. దేవుని కడపలో స్వామి మూల విరాట్ వెనుక దాదాపు 12 అడుగుల హనుమంతుని కుడ్య శిల్పాన్ని నేటికి మనం చూడవచ్చు. కడప రాయుని ఆలయం ఎదురుగా పుష్కరిణి వద్ద బేడి ఆంజనేయస్వామి ఆలయం ఉంది.



నగరంలోని తొలి ఆంజనేయస్వామి ఆలయం

- కడప నగరంలో తొలిసారిగా నిర్మించినది ఆంజనేయస్వామి ఆలయమే. నవాబుల కాలంలో దీన్ని నిర్మించారు. బుగ్గ వంక ఒడ్డున బ్రాహ్మణ వీధి ప్రారంభంలో ఈ పురాతన ఆలయం ఉంది. ఒకప్పుడు కడప నగరాన్ని పాలించిన నవాబులు ఈ ఆలయాన్ని బ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా కట్టించి ఇవ్వడం విశేషం. కడప నగరంలో నిర్మించిన తొలి ఆలయం ఇదేనని చెప్పవచ్చు.
- జిల్లాలో అత్యధిక మంది భక్తులు వచ్చే ఆలయాలలో వేంపల్లె వద్ద గల గండి వీరాంజనేయ స్వామి ఆలయం, రాజుపాలెం మండలంలోని వెల్లాల సంజీవరాయుని (హనుమంతుని) ఆలయంతో పాటు పలు ఆలయాలు చారిత్రకంగా ప్రసిద్ధిగాంచాయి. జిల్లాలో దాదాపు 500కుపైగా ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. కడప నగరంలో 30కి పైగా ఉన్నాయి.

పేద వర్గాల సంక్షేమమే సీఎం ధ్యేయం

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి తెలిపారు. శుక్రవారం 18వ డివిజన్ పరిధిలోని సాయినగర్, విశ్వనాథపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఇళ్లులేని పేద ప్రజలకు ఇంటి స్థలం ఇచ్చి వారు ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక సహకారం అందిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో రూ.2,750 పెన్షన్ ఇస్తున్నామన్నారు. చదువుకునే పిల్లలు తల్లిదండ్రులకు భారం కాకూడదనే అమ్మఒడి అందజేస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి నెల మేనిఫేస్టోలో చెప్పినవిధంగా సంక్షేమ పథకాలను మన ముఖ్యమంత్రి ఇస్తున్నారని తెలిపారు.డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, మల్లికార్జున యాదవ్, సుబ్బరాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు రాజారెడ్డి, గజ్జల శ్రీరామిరెడ్డి, నాయకులు గజ్జల ఈశ్వర్రెడ్డి, నీలకంఠారెడ్డి, పల్లవలి చంద్రశేఖర్రెడ్డి, మోద్దీన్, కోకటం లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్రెడ్డి

షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ సభ్యులకు సన్మానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఇటీవల విజయవాడలో నిర్వహించారు.జిల్లాకు చెందిన బొర్రా రాజన్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, నాగిపోగు రమణయ్యను ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాబుమోహన్ అధ్యక్షతన సంక్షేమ సంఘం నూతన సభ్యులను ఘనంగా సత్కరించారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామని సన్మాన గ్రహీతలు పేర్కొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి బత్తల ప్రభాకర్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ రమణ, సీవీ రమణ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఏటీసీ క్యాంపులో జిల్లా కేడెట్స్ ప్రతిభ

వైవీయూ: చిత్తూరులో ఈనెల 4 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో కడప 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్సీసీ కేడెట్స్ చక్కటి ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం సాధించారు. క్యాంపులో తల్సైనిక్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్ నిర్వహించగా అన్ని రంగాల్లో రాణించి రెండోస్థానంలో నిలిచారు. క్యాంపులో మ్యాప్రీడింగ్, గుడారాల నిర్మాణము, ఆరోగ్య విద్య, ఆప్టికల్స్, ఫైరింగ్లలో పోటీలను నిర్వహించారు. కేడెట్స్ను 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్కుమార్ థాపా అభినందించారు.



రెండోస్థానంలో నిలిచిన కడప ఎన్సీసీ కేడెట్స్

ఏబీవీపీ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: అఖిల భారత విద్యార్థి పరిషత్తు (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలో మోడల్ ఎంసెట్ పరీక్షను నిర్వహించారు. ఇందుకు సంబంధించిన మోడల్ ఎంసెట్ ప్రశ్నపత్రాన్ని కడప డీఎస్పీ షరీఫ్ చేతుల మీదుగా విడుదల చేసి విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విభాగ కన్వీనర్ కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఈ నెల 15వ తేదీ నుంచి ఎంసెట్పరీక్షలు రాయబోతున్నారన్నారు. ఈ తరుణంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షా రాయాలనే ఉద్దేశ్యంతో ఏబీవీపీ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షకు నగరంలోని దాదాపు 100 మంది విద్యార్థులు హాజరయారన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మంజూనాధరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'శ్రీహరి' విద్యార్థుల ప్రతిభ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ జి. సుబ్బారెడ్డి తెలిపారు. మూడో సెమిస్టర్ బీజెడ్సీలో బి. రంజిత్నాయక్ 9.79, ఎంఎస్సీఎస్లో ఎ. వెంకటరమ 9.63, బీకాం కంప్యూటర్స్లో జి. గురులక్ష్మి 9.35, బీఏలో ఎ. భరత్రెడ్డి 9.03, బీబీఏలో ఎస్. అమీనా 8.93, ఎంపీసీఎస్లో గీతావర్షిణి 8.51 జీపీఏ సాధించినట్లు తెలిపారు. ప్రథమ సెమిస్టర్ బీజెడ్సీలో కె. మానస 9.70, బీబీఏలో ఎస్.వెంకటేశ్వర్లు 9.07, ఎంపీసీఎస్లో జి.సాయిలక్ష్మి 9.06, బీఏలో కె. మునీరున్నీసా 9, ఎంఎస్సీఎస్లో మనోహర్ 8.82, బీకాంలో సాయిస్వరూప 8.85 జీపీఏ సాధించినట్లు తెలిపారు.

కిసాన్ డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందించే కిసాన్ డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ సభా భవనంలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనునిత్యం రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పాటుపడుతోందని ప్రభుత్వం అందించే పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవడంతో పాటు భూసార పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని ఆయన కోరారు. కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ సూక్ష్మ, తుంపర సేద్యానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాల వారిగా లక్ష్యాలను అధిగమించవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్బాబు మాట్లాడుతూ 2023 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా మొదటి విడత అర్హుల జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. జాబితాలో పేర్లు లేని వారు ఎవరైనా ఉంటే ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేయించుకోని రైతులు వెంటనే చేయించుకోవాలన్నారు వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు భాస్కర్రెడ్డి పాల్గొన్నారు.

నిషేధిత మందులు అమ్మితే చర్యలు

పెండ్లిమర్రి : పురుగు మందుల దుకాణాదారులు ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులను రైతులకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్బారావు హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఎరువులు, పురుగు మందుల డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డీలర్ స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా పెట్టాలన్నారు. పురుగు మందులు విక్రయించేటప్పుడు రసీదు తప్పని సరిగా రైతులకు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ రేట్ల కన్నా అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయాధికారిని బ్లెస్సీ, ఏఈఓలు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు :ఆస్థానయే గౌసియా 91వ ఉరుసు మహోత్సవం సందర్భంగా నిర్వహించే మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి కుమారుడు సయ్యద్ షా తాహీర్పీరాఖాద్రీ శుక్రవారం స్థానిక ఆస్థానయే గౌసియాలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 23వ తేదీన ఉదయం తొమ్మిది గంటలనుంచి హిజామా(కప్పింగ్ థెరఫీ) గౌసియా షాదీఖానాలో నిర్వహిస్తారన్నారు. 28వ తేదీ ఆదివారం భారీగా మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య చికిత్స అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు.

కల్యాణ వైభోగమే!



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్స్పెక్టర్ ఈశ్వర్రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. భక్తులు విశేష సంఖ్యలో కల్యాణోత్సవానికి హాజరయ్యారు. కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. కనుల పండువైన అలంకారంలో ఉన్న స్వామి, అమ్మవార్లను తిలకించిన భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అర్చకులు వారికి మంగళ హారతులు ఇచ్చారు.

- కడప నగర పరిధిలోని ఆలంఖాన్పల్లె వద్దగల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం కల్యాణోత్సవానికి హాజరు కావడం పవిత్ర కార్యక్రమంగా భావించిన స్థానిక భక్తులు విశేష సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు క్రమంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆత్మబంధువుకు అంతిమ సంస్కారం

కడప అర్బన్: నగరంలోని బాలాజీనగర్ రోడ్ నెంబర్.12లో ధనలక్ష్మి (70) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు బంధువులు ఎవరూ లేకపోవడంతో కడప తాలూకా పోలీసులు మేముసైతం సేవాసంస్థ వారిని అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. దీంతో వారు హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో సంస్థ ప్రధాన కార్యదర్శి గుండ్లకొండ రవి, వంకధారి రాము, రెడ్డెయ్య, దామోదరం, రామరాజు, శివరాం, కానిస్టేబుల్ కిరణ్నాయక్ పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

జమ్మలమడుగు : పట్టణంలోని పతంగేరామన్నరావు క్రీడా మైదానంలో ఎద్దుల పోటీలు రసవత్తరంగా సాగాయి. నారాపురవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ఆరుపళ్ల ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. శనివారం ఉదయం సీనియర్ ఎద్దుల పోటీలు జరుగుతాయన్నారు. రైతులకు వైఎస్సార్సీపీ నాయకుడు హృషికేశవరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ప్రారంభమైన సుంకులమ్మ తిరునాల



కమలాపురం : పట్టణంలోని పడమటవీధి సమీపంలో చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ తల్లి అష్టమ తిరునాల మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తదితర పూజలు నిర్వహించి సాయంత్రం మహా మంగళహారతి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

అలరించిన ముగ్గుల పోటీలు : మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 19 మంది మహిళలు ముగ్గులు వేశారు. వారిలో గొంగల్రెడ్డి భవాని వేసిన అమ్మవారి ముగ్గు ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే ఉమామహేశ్వరీ, రేణుకాదేవి, లక్ష్మీదేవి, శారద, వడ్డే భవాణిలు తర్వాత స్థానాల్లో నిలిచారు. గెలుపొందిన విజేతలకు చవ్వారెడ్డి రామసుబ్బారెడ్డి భార్య దేవసేనమ్మ వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి, రూ.500 నగదు బహుమతులను మాజీ మంత్రి మైసూరారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీఎస్ నారాయణరెడ్డి తెలిపారు. మాజీ మంత్రి ఎంవీ మైసూరారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పైపులైన్ లీకేజీ.. వృథా అవుతున్న నీరు

కడప కార్పొరేషన్: కడప నగరం మట్టిపెద్దపులి సమీపంలోని బుర్హానుద్దీన్ మసీదు ఎదురుగా ట్రంకురోడ్డులో తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడింది. దీంతో నీరు వృథాగా ప్రవహిస్తోంది. నగరపాలక అధికారులు స్పందించి పైపులైన్కు మరమ్మతులు చేసి లీకేజీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.